# సాక్షి
# భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం : 27 : ఆగస్టు : 2024


గరిష్టం / కనిష్టం
32° / 24°

**వాతావరణం**
జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.



కరకగూడెంలో కృష్ణ, యశోద వేషధారణలలో చిన్నారులు

## వాడవాడలా వేడుకలు

- గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి..
- కృష్ణుడి వేషధారణలో చిన్నారులు..

జిల్లా వ్యాప్తంగా శ్రీ కృష్ణాష్టమి పండుగను సోమవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. ఉట్లు కొట్టే వేడుకల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. ఆలయాల్లో భక్తులు కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. పలు చోట్ల చిన్ని కృష్ణుడి పాదముద్రలను ఇంటి ముంగిళ్లలో వేసి భక్తిని చాటుకున్నారు.

- ఫొటోలు 9లో

## న్యూస్‌రీల్

### రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారి మూలమూర్తులను ముత్యాల వస్త్రాలతో అలంకరించడం ఈ ఆలయంలో ఆనవాయితీగా వస్తోంది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### 1,313 టన్నుల యూరియా దిగుమతి

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మంకు రైల్వే వ్యాగిన్ల ద్వారా సోమవారం 1313 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయింది. ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన ఈ యూరియాను ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని గోదాంలకు ఇక్కడ నుంచి లారీల్లో పంపించారు. భద్రాద్రి జిల్లాకు 700 మెట్రిక్ టన్నులు, ఖమ్మం జిల్లాకు 313, మహబూబాబాద్ జిల్లాకు 300 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా పంపించామని అధికారులు తెలిపారు. కాగా, జిల్లాలోని మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉండగా.. సెప్టెంబర్ నుంచి యాసంగి సీజన్ వరకు సరిపడేలా అవసరమైన మేరకు నిల్వ చేస్తున్నట్లు వెల్లడించారు.

# లిథియంపై నజర్



బొగ్గు తవ్వకాలతో మొదలైన సింగరేణి సంస్థ బహుముఖంగా విస్తరించే ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. ఇప్పటికే థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో దూసుకుపోతున్న సంస్థ.. గ్రీన్ ఎనర్జీలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఈ క్రమంలో లిథియం మైనింగ్‌పైనా దృష్టి సారించింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

**బహుముఖ విస్తరణపై సింగరేణి దృష్టి**

- లిథియం మైనింగ్‌పై రేపు డైరెక్టర్ల స్థాయి సమావేశం
- ఇప్పటికే ఈ బ్లాక్‌లను వేలం వేస్తున్న కేంద్రం
- గత నవంబర్‌లో మొదలైన ప్రక్రియ

**బ్యాటరీలకు పెరుగుతున్న డిమాండ్..**

మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత లిథియం అయాన్ బ్యాటరీలకు డిమాండ్ ఎక్కువైంది. తక్కువ పరిమాణంలో ఇమిడిపోతూ ఎక్కువ విద్యుత్ శక్తిని నిల్వ చేయడం ఈ బ్యాటరీల ప్రత్యేకత. ప్రస్తుతం లిథియం అయాన్ బ్యాటరీలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అయితే వాయు కాలుష్య కట్టడిలో భాగంగా పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఈవీ రంగానికి ప్రోత్సాహకాలు, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అయితే భవిష్యత్‌లో పెరిగే అవసరాలను దృష్టిలో ఉంచుకుని మన దేశంలోనే లిథియాన్ని వెలికి తీయాలని నిర్ణయించింది.

**సింగరేణికి సూచన..**

మైనింగ్ రంగంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థ గత పదేళ్లుగా విస్తరణ బాట పట్టింది. ముందుగా మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభించింది. అక్కడ వచ్చిన విజయాలతో త్వరలో రామగుండం, ఒడిశాలోని నైనీలలో క్యాప్టివ్ థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపనకు సిద్ధమవుతోంది. మరోవైపు సోలార్ ఎనర్జీలోనూ సత్తా చాటింది. సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి దిశగా ఒక్కో అడుగు వేస్తూ సాగుతోంది. అంతేకాదు.. జియో థర్మల్, పంప్డ్ స్టోరేజీ హైడల్ పవర్ ప్లాంట్ వంటి గ్రీన్ ఎనర్జీలపైనా పని చేస్తోంది. వందేళ్లకు పైగా తెలంగాణకే పరిమితమైన సంస్థ ఇప్పుడు ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తికి సిద్ధమైంది. ఈ క్రమంలో లిథియం మైనింగ్‌లోకి సింగరేణి వస్తే బాగుంటుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల లిథియం మైనింగ్‌పై దృష్టి సారించాలని సింగరేణి యాజమాన్యానికి సూచించారు. అందులో భాగంగా లిథియం మైనింగ్‌కు సంబంధించి సమాచార సేకరణ, విశ్లేషణతో పాటు యాక్షన్ ప్లాన్ రూపొందించుకునే పనిలో సంస్థ ఉంది. ఈనెల 28న ఈ అంశంపై డైరెక్టర్ల స్థాయిలో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

**ఛత్తీస్‌గఢ్‌లో తొలి వేలం..**

కేంద్ర సర్వే సంస్థల రికార్డుల ప్రకారం దేశంలోని బిహార్, గుజరాత్, జార్ఖండ్, ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో లిథియం నిల్వలు ఉన్నట్టు తేలింది. ఈ ఖనిజాన్ని వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల తరహాలోనే గతేడాది నవంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించింది. మిగిలిన ఖనిజాల మైనింగ్‌తో పోల్చితే లిథియం వెలికితీతకు ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో మూడోసారి వేలం నిర్వహించగా ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ఉన్న కాట్గోరా బ్లాక్‌ను ఓ ప్రైవేట్ సంస్థ దక్కించుకుంది. శాంతి భద్రతల సమస్య కారణంగా కశ్మీర్ బ్లాక్‌ను కైవసం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ముందుకు రాలేదు. అయితే లిథియం మైనింగ్‌కు నిర్వహించిన వేలంలో తమిళనాడు కేంద్రంగా పని చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ) ఇండియా పాల్గొంది. ఈ సంస్థ బొగ్గు, లిగ్నైట్ మైనింగ్‌తో పాటు థర్మల్, సోలార్ ఎనర్జీ రంగంలో రాణిస్తోంది.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే సాంబశివరావు

**పాల్వంచ:** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాల్వంచలో జెన్‌కో కేటాయించిన స్థలంలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్‌రెడ్డి నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని మంత్రి పొంగులేటి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మీడియా పాత్ర మరువలేనిదన్నారు. అయితే, గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని తెలిపారు. తాము మాత్రం స్వేచ్ఛగా వార్తలు రాసుకునే వీలు కల్పించామని.. ఈ క్రమంలో యూ ట్యూబ్‌ల పేరిట తమ ప్రభుత్వంపై బురదజల్లే వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. వైఎస్ హయాంలో హైదరాబాద్‌లో జవహర్ సొసైటీకి 72 ఎకరాల భూమి కేటాయిస్తే గత ప్రభుత్వం ఇవ్వలేదని, త్వరలోనే తాము బహిరంగ సభ ఏర్పాటు చేసి ఇస్తామని తెలిపారు. అలాగే, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డుల సమస్యలు పరిష్కరిస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించిన సురేష్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జెన్‌కో ట్రెనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, ఏపీఆర్‌ఓ అస్గర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండల్‌రావు, బాధ్యులు రుద్రారపు సంజీవ్ కుమార్, చంద్ర నర్సింహారావు, షేక్ సుభానీ, వెంకటనారాయణ, రజాక్, జగదీష్, జైనుల్లాబుద్దీన్, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కల్లోజీ శ్రీనివాస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు సాబీర్‌పాషా, ఝెుర్రా కామేష్, కోనేరు చిన్ని, నాగ సీతారాములు పాల్గొన్నారు.

**పరామర్శలు..**

**కొత్తగూడెం అర్బన్/సుజాతనగర్/పాల్వంచ రూరల్:** కొత్తగూడెంలో కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా పూర్ణ తండ్రి ఊమ్లా నాయక్ ఇటీవల మృతి చెందగా.. ఆయన కుటుంబీకులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. సుజాతనగర్ మండలం వేపలగడ్డలో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొప్పుల పుల్లారెడ్డి కుటుంబాన్ని సైతం పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సొసైటీ చైర్మన్ మండె హన్మంతరావు, నాయకులు ఊకంటి గోపాలరావు, లింగం పిచ్చిరెడ్డి, నాగా సీతారాములు చింతలపూడి రాజశేఖర్, ఆళ్ల మురళి, కోనేరు చిన్ని, దేవీప్రసన్న, వై.శ్రీనివాస్‌రెడ్డి, సుందర్‌రాజ్, అంబటి శ్రీను, రాజేష్ పాల్గొన్నారు. కాగా, తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేయాలని, పిడమర్తి రవికి నామినేటెడ్ పదవి ఇప్పించాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్ మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మోదుగు జోగారావు, ప్రవీణ్, జ్యోషి, శివ, మధు పాల్గొన్నారు.

# మూడు.. దాటడం లేదు!

- సత్తుపల్లి, మధిర, 'గూడెం'లోనే రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లకు సొంత భవనాలు
- మిగతావన్నీ అరకొర వసతులతో అద్దె భవనాల్లో..
- కొన్ని చోట్ల శంకుస్థాపనకే పరిమితం
- ఆదాయం తెస్తున్న శాఖకు సౌకర్యాలు అంతంతే ..
- తాజాగా సొంత భవనాల నిర్మాణంపై మంత్రి పొంగులేటి హామీ



అద్దె భవనంలో కొనసాగుతున్న ఇల్లెందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** అసలే అద్దె భవనాలు.. అపై ఇరుకు గదులు.. ముఖ్యమైన ఫైళ్లను భద్రపరిచేందుకు కూడా కానరాని స్థలం.. విభాగాల వారీగా కరువైన గదులు.. ఇవీ ప్రభుత్వానికి ఘనమైన ఆదాయాన్ని చేకూరుస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కేవలం మూడు మాత్రమే సొంత భవనాల్లో, మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నిత్యం ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఈ కార్యాలయాల్లో జరుగుతున్నా సొంతభవనాలు లేకపోవడంతో అటు ఉద్యోగులు, ఇటు క్రయవిక్రయదారులు అవస్థ పడుతున్నారు. గతంలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదు. శాఖ ఉన్నతాధికారులు, రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయాలకు సొంత భవనాల నిర్మిస్తామని ప్రకటించడంతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు.

**అసౌకర్యాలకు నెలవు**

భూములు, ఆస్తుల క్రయవిక్రయాలు నానాటికీ పెరుగుతుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో రిజిస్ట్రేషన్లు కూడా అదే స్థాయిలో ఉంటున్నాయి. అయితే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అరకొర వసతులు కలిగిన అద్దె భవనాల్లో ఉండడంతో వచ్చే వారికి, ఉద్యోగులకు అసౌకర్యంగా మారాయి. అద్దె భవనాల్లో ఉన్న కార్యాలయాల్లో పలు విభాగాలకు సరిపడా గదులు కూడా లేవు. దీంతో ఫొటోలు దింపే కంప్యూటర్ ఆపరేటర్ సబ్ రిజిస్ట్రార్ క్యాబిన్ ముందే టేబుల్ ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**భారీగానే అద్దె బకాయిలు**

ఉమ్మడి జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకుగాను సత్తుపల్లి, మధిర, కొత్తగూడెంలో ప్రభుత్వ భవనాల ద్వారా సేవలందుతున్నాయి. ఇక ఖమ్మం, ఖమ్మంరూరల్, కూసుమంచి, వైరా, కల్లూరు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు జిల్లా రిజిస్ట్రార్, చిట్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ భవనాల్లో ముఖ్యమైన ఫైళ్ల భద్రపర్చడం, విభాగాల వారీగా క్యాబిన్ల ఏర్పాటుకు స్థలం లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతూనే విధులు నిర్వర్తిస్తున్నారు. అద్దె భవనాలకు నెలకు దాదాపు రూ.4లక్షల వరకు అద్దెలు చెల్లిస్తుండగా.. జిల్లాలో రూ.కోటికి పైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఖమ్మంలోని జిల్లా రిజిస్ట్రార్, చిట్ రిజిస్ట్రార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నెలకు రూ.2 లక్షల చొప్పున మూడేళ్ల అద్దె కట్టాల్సి ఉంది.

**ఇక సొంత భవనాలు**

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న శాఖల్లో రిజిస్ట్రేషన్ల శాఖ ప్రధానమైంది. ఉమ్మడి జిల్లా నుంచి ఏటా 50 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుండగా దాదాపు రూ.250 కోట్ల వరకు ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అవుతోంది. ఈ నేపథ్యాన రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో హైదరాబాద్‌లో భేటీ అయిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అద్దె బకాయిలు విడుదల చేయడమే కాక రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని ప్రకటించారు. దీంతో దశలవారీగా సకల సౌకర్యాలతో ఈ నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. పనుల నిమిత్తం వచ్చే వారు కూర్చునేందుకు వరండాలు, పార్కింగ్ షెడ్లతో పాటు వీఐపీ లాంజ్‌లు సైతం నిర్మించి తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

**స్థలం చూపించినా నిధులు లేక**

పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించి శంకుస్థాపనలు చేసినా నిర్మాణాలు జరగలేదు. వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2016 జూన్ 12న శంకుస్థాపన చేస్తే ఇప్పటికీ పనులు మొదలుకాలేదు. ఇక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు ఖమ్మం, ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి వద్ద స్థలం కేటాయించింది. అయినా ఇప్పటి వరకు పురోగతి లేదు. నిధులు మంజూరు చేయకపోవడంతోనే భవన నిర్మాణాలు ఆగిపోయినట్లు చెబుతున్నారు.

# పరిశుభ్రత పాటిస్తే మేలు..

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..
- జ్వరం వస్తే నిర్లక్ష్యం వీడి వైద్యులను సంప్రదించాలి
- సాక్షి 'ఫోన్ ఇన్'లో భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

సాక్షి ఫోన్ ఇన్

**భద్రాచలంఅర్బన్ :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. సోమవారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్'లో ఆయన పలువురి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. జ్వరాలు ప్రబలుతున్నప్పుడు నిర్లక్ష్యాన్ని వీడి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు.

**ప్రశ్న :** పొలాల్లో గ్లైసిన్ వేయడం వల్ల కీళ్ల నొప్పులు వస్తాయా లేక జ్వరం వల్లనా ?

– సతీష్, రైతు, మారాయిగూడెం

**జవాబు :** ఇటీవల వైరల్ జ్వరాలతో కీళ్ల నొప్పులు వస్తున్నాయి. సకాలంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యులను సంప్రదించి అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలి. జ్వరం తగ్గినా పారాసిటమాల్ మందులు వాడితే నొప్పులు తగ్గిపోతాయి. ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారు ఎక్కువ విశ్రాంతి తీసుకుంటే నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

**ప్ర :** జ్వరాలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– శ్రీనివాస్, సారపాక

**జ :** జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రధానంగా దోమకాటు లేకుండా చూసుకోవాలి. నీళ్లు నిల్వ ఉండకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. డెంగీ దోమ పగలు మాత్రమే కుడుతుంది. మోకాళ్ల కిందే ఈ దోమ కుట్టే ప్రమాదం ఉన్నందున నిండు దుస్తులు ధరించాలి.

**ప్ర :** మా గ్రామంలో జ్వరాల తీవ్రత పెరుగుతోంది. వైద్య శిబిరాన్ని నిర్వహించండి..

– కల్పన, నెమలిపేట, దమ్మపేట మండలం

**జ :** జ్వరాల వ్యాప్తి లేకుండా ముందుగా మీ ఇంట్లో వ్యక్తిగత శుభ్రత పాటించి, దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోండి. మీ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య ఉంటే గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం అందించండి. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దు, వ్యాధి ముదరకముందే స్థానిక వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలి.

**ప్ర :** సీజనల్ వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

– అబ్బిరెడ్డి, భద్రాచలం/ వెంకట్, హైదరాబాద్

**జ :** నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలుతుంటాయి. దోమలు రాకుండా ఉండాలంటే పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. కూలర్లు, పూలకుండీలు, టైర్లు, సీసాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి. సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టాలకు నైలాన్ జాలిని కట్టాలి. ఇంటి కిటికీలు, డోర్లకు జాలీని అమర్చాలి. దోమ తెరలు వినియోగించాలి.

**ప్ర :** కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటున్నాయి..

– మాధురి రెడ్డి, సారపాక

**జ :** జ్వరం వస్తే వారం రోజుల పాటు ఇబ్బంది ఉంటుంది. కీళ్ల నొప్పులు ఎక్కువ రోజులు ఉండే ప్రమాదం ఉంది, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలి. మల్టీ విటమిన్, పారాసిటమాల్ వంటి ట్యాబ్లెట్లు ఆరు గంటలకు ఒకసారి వేసుకోవాలి. అత్యవసరమైతే భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వచ్చి మందులు తీసుకోవచ్చు.

**ప్ర :** గర్భిణులకు జ్వరం వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి ?

– లక్ష్మి, భద్రాచలం

**జ :** మొదటి మూడు నెలల గర్భిణికి జ్వరం వస్తే వెంటనే స్త్రీ వైద్య నిపుణులను సంప్రదించాలి. లేదంటే వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే తల్లీబిడ్డలకు ఇబ్బంది అవుతుంది.

**ప్ర :** డెంగీ జ్వరాలతో ఇబ్బందిగా ఉంది..

– మారం శ్రీనివాసరెడ్డి/ గోపాల్, భద్రాచలం

**జ :** డెంగీ జ్వరంతో కాళ్లు లాగినట్లు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు అవుతుంటాయి. దద్దుర్లు రావడం, అంతర్గతంగా రక్తస్రావం కావడం, ర్యాషెస్ వంటివి వస్తుంటాయి. ఈ సమయంలో జ్వరం ఎక్కువగా 104 డిగ్రీల వరకు ఉంటుంది. దోమలు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మోకాళ్ల కింద మాత్రమే కుడుతుంటాయి. జాగ్రత్తగా ఉండాలి. ఈ సమయంలో సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించొద్దు. ఎక్కువగా నీరు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలి.

**ప్ర :** ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారా?

– శివ, చోడవరం, ఏపీ

**జ :** ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. టైఫాయిడ్, ప్లేట్‌లేట్ సంఖ్య, తదితర రక్త పరీక్షలు చేస్తున్నాం. డెంగీ వ్యాధికి సంబంధించి భద్రాచలంలో రక్త నమూనాలు సేకరించి, జిల్లా కేంద్రంలోని టీ–హబ్‌కు పంపిస్తున్నాం.

**ప్ర :** డెంగీ పరీక్షలు రోజూ నిర్వహించడం లేదు. దీనిపై చర్యలు తీసుకోలేరా?

– అనిల్, సారపాక

**జ :** జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రెండు రోజులకు ఒకసారి జిల్లా కేంద్రంలో టీ– హబ్ నుంచి వాహనం ద్వారా రక్తనమూనాలు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కనీసం ఈ రెండు నెలలైనా నిత్యం డెంగీ పరీక్షలు చేయాలని కోరుతాం.

**ప్ర :** భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మందుల కొరత ఉందా ?

– పటేల్, భద్రాచలం

**జ :** ఏరియా ఆస్పత్రిలో మందుల కొరత ఉన్నమాట వాస్తవమే. కానీ ఎమర్జెన్సీలో ఉపయోగించే మందులన్నీ ఉన్నాయి. మందుల కొరత అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.

### జిల్లా విద్యార్థికి భువనేశ్వర్ ఎయిమ్స్‌లో సీటు



లక్ష్మణ్ సాహిత్

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బోడ పద్మ – శ్రీకృష్ణల కుమారుడు బోడా లక్ష్మణ్‌సాహిత్ భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్ రావడంతో ఆలిండియా స్థాయిలో భువనేశ్వర్ ఎయిమ్స్‌లో సీటు దక్కింది.

### నేడు నిధి ఆప్‌కే నిఖత్

**ఖమ్మం సహకారనగర్:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యాన మంగళవారం నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె.సునీల్ తెలిపారు. ఈసమావేశాల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు ఆన్‌లైన్ సేవల విధి విధానాలు వివరిస్తామని పేర్కొన్నారు. పాల్వంచలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లా వాసులు పాల్గొనాలని సూచించారు.

## క్లుప్తంగా

### నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి


భద్రాచలం వద్ద గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం 20.2 అడుగులు ఉన్న నీటి మట్టం సోమవారం రాత్రికి 28 అడుగులకు చేరింది. నది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడుతుండడంతో నీటి మట్టం పెరుగుతోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మరో రెండు అడుగులు పెరిగి, ఆ తర్వాత తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

### 28, 29 తేదీల్లో ఉద్యోగులకు క్రీడా పోటీలు

కొత్తగూడెంటౌన్: ఈనెల 28, 29 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పి.పరంధామరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాలీబాల్ (మెన్), చెస్(మెన్, ఉమెన్), త్రోబాల్ (ఉమెన్), బ్యాడ్మింటన్ (ఉమెన్, మెన్), క్రికెట్ (మెన్), టగ్ ఆఫ్ వార్ మెన్, ఉమెన్, మ్యూజికల్ చైర్(ఉమెన్), టెబుల్ టెన్నిస్ (మెన్, ఉమెన్), రన్నింగ్ 100 మీటర్లు (మెన్, ఉమెన్) విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. హాజరయ్యే ఉద్యోగులు ఈనెల 27 లోగా ఆయా శాఖల అధికారుల ద్వారా తమ కార్యాలయంలో వివరాలు అందజేయాలని కోరారు.

### నేడు వీకే-7, రొంపేడు గనులపై ఎఫ్ఏసీ భేటీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి వీకే-7 ఓసీ, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓసీలకు సంబంధించి అనుమతి విషయమై మంగళవారం ఎఫ్ఏసీ(ఫారెస్ట్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరగనుంది. మొదటి దశ పర్యావరణ అనుమతులు జారీ చేసేందుకు ఢిల్లీలో ఈ సమావేశం ఏర్పాటుచేయగా సింగరేణి నుంచి అధికారుల బృందం పూర్తి వివరాలతో అక్కడకు వెళ్లింది. గత మూడేళ్లుగా అనుమతులపై తాత్సారం జరుగుతుండడగా ఈసారైనా సాధించాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు గనులకు స్టేజ్ -1 అనుమతులు లభిస్తే ఈ ఏడాది సుమారు 7.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదవుతుందని చెబుతున్నారు. తద్వారా సంస్థ నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని భావిస్తున్నారు.

### పలు ప్రైవేట్ ఆస్పత్రులపై సీఐడీ కేసులు

ఖమ్మంక్రైం: ముఖ్యమంత్రి సహాయ నిధి( సీఎంఆర్ఎఫ్)కి సంబంధించి నకిలీ బిల్లులతో సొమ్ము కాజేసిన ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై సోమవారం సీఐడీ అధికారులు కేసులు నమోదు చేశారు. చికిత్స చేయకున్నా చేసినట్లు, పరికరాలు లేకున్నా ఉన్నట్లుగా నమ్మించి నకిలీ పత్రాలతో కొన్ని ఆస్పత్రుల యజమాన్యాలు రూ.కోట్ల మేర బిల్లులు తీసుకున్నారని సీఎంఆర్ఎఫ్ రెవెన్యూ విభాగం సెక్షన్ ఆఫీసర్ డీఎస్ఎన్.మూర్తి గత ఏడాది సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో అదే ఏడాది ఏప్రిల్‌లో అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఆరోపణలు ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ జాబితాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఆస్పత్రులు కూడా ఉండగా.. ఖమ్మంలో ఆరు, భద్రాద్రి జిల్లా కేంద్రంలో నాలుగు ఆస్పత్రులపై కేసు నమోదైంది. త్వరలోనే ఆయా ఆస్పత్రుల బాధ్యులను అరెస్ట్ చేసే అవకాశముందని సమాచారం.

### వ్యవసాయ శాఖ బదిలీల్లో పైరవీలు

- తొలిదశలో పలు పోస్టుల 'బ్లాక్'
- ఆపై దక్కించుకున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో పైరవీలు రాజ్యమేలినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో మాదిరి గానే ఈనెల 2, 3వ తేదీల్లో ఏఈఓలు, ఏఓలకు, ఈనెల 20న వ్యవసాయ సహాయ సంచాలకులు, ఉప సంచాలకులు, సంయుక్త సంచాలకుల బదిలీలు చేపట్టారు. ఒకే చోట్ల నాలుగేళ్ల సర్వీస్ నిండిన వారిని బదిలీ చేస్తూ మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మించకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం అధికారులు, ఉద్యోగులు ఆప్షన్ ఇచ్చినా వాటిని పక్కన బెట్టి ఇష్టారాజ్యంగా బదిలీలు చేశారని శాఖలో చర్చ జరుగుతోంది. జోన్ పరిధి ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో కొన్ని పోస్టులను బ్లాక్‌లో పెట్టి ప్రక్రియ చేపట్టారని... ఆతర్వాత కొందరు అధికారులు దొడ్డిదారిన ఆ పోస్టులను దక్కించుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. సీనియారిటీ, ఇతర అర్హతల ఆధారంగా బదిలీలు చేపడితే ఆయా ఉద్యోగులకు బ్లాక్ చేసిన పోస్టులు దక్కవని తెలుస్తోంది. ఈ కారణంగా అర్హులైన కొందరు అధికారులకు దూర ప్రాంతాల్లో పోస్టింగ్ రావడంతో ఆవేదన చెందుతున్నారు. ఇక కొన్ని పోస్టులకు అర్హత కలిగిన అధికారులు ఉన్నా భర్తీ చేయకుండా ఇన్‌చార్జిలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ఈమేరకు రూ.లక్షల్లో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతుండగా పలువురు ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందనే చర్చ జరుగుతోంది.

# బడిలో భయాందోళన!

- పాఠశాలల్లో దారితప్పుతున్న కొందరు ఉపాధ్యాయులు
- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన, వేధింపులు
- ఇటీవల జరుగుతున్న సంఘటనలతో తల్లిదండ్రుల ఆందోళన
- సస్పెన్షన్, కేసులతో సరిపెడుతున్న విద్యా, పోలీస్ శాఖలు
- సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించాలని పలువురి డిమాండ్


సింగరేణి పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: విద్యాబుద్ధులు నేర్పించి భవిష్యత్‌కు దారి చూపాల్సిన ఉపాధ్యాయులే దారి తప్పుతున్నారు. ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న సంఘటనతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఉపాధ్యాయుల చేష్టలు భయాందోళన కలిగిస్తున్నాయని పేర్కొంటున్నారు. అసభ్యంగా ప్రవర్తించే ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి, పోక్సో కేసులు నమోదు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తేనే చెడు ఆలోచనలున్న వారికి బుద్ధి వస్తుందని పేర్కొంటున్నారు.

**పనిచేయని రక్షణ కమిటీలు**

బాలికల రక్షణకు ప్రభుత్వ పాఠశాలల్లో మూడేళ్ల క్రితం బాలికా సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీలో పాఠశాల ఉపాధ్యాయుడు, పోలీసు, వైద్య సిబ్బంది ఒక్కొక్కరు, సామాజిక కార్యకర్త, విద్యార్థినులు ఉండేవారు. ప్రస్తుతం ఆ కమిటీలు క్రియాశీలకంగా లేవు. ఘటనలు జరిగినప్పుడు ఆ కమిటీలున్నాయని విద్యాధికారులు చెబుతున్నారు తప్ప మిగతా సమయాల్లో ఎక్కడ కూడా వాటి ప్రస్తావన తేవడంలేదు. అవగాహన సమావేశాలు నిర్వహించడంలేదు. కమిటీలను కేవలం కాగితాలకే పరిమితం చేయడంతో నీచబుద్ధి ఉపాధ్యాయుల చేష్టలు మితిమీరిపోతున్నాయి. కమిటీలు సక్రమంగా పనిచేస్తే ప్రాథమిక దశలోనే సమస్యలు బహిర్గతమయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా విద్యాశాఖ మేల్కొని కమిటీలను క్రియాశీలకం చేసి, లేని పాఠశాలల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తే విద్యార్థినులకు, తల్లిదండ్రులకు కొంతైనా భరోసా కలుగుతుంది.

**ఇటీవల వెలుగుచూసిన కొన్ని సంఘటనలు..**

- గత జూలైలో ఇల్లెందు పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి బాలికలను వేధిస్తున్న ఉపాధ్యాయుడికి తల్లిదండ్రులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించగా, విచారణ చేసి పోక్సో కేసు నమోదు చేశారు.
- కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి తీరును నిరసిస్తూ గత శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆ ఉపాధ్యాయుడిని పోలీసులకు అప్పగించగా విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేశారు. సింగరేణి ఎడ్యూకేషన్ విభాగం అధికారులు ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- అశ్వారావుపేట మండలంలో అసభ్యప్రవర్తన కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని చెట్టుకు కట్టేసి కొట్టారు.
- ములకలపల్లి మండలంలో మద్యం మత్తులో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడికి నడిచే ఓపిక కూడా లేకపోవడంతో అక్కడి స్థానికులు గేదెల పాకలో ఉపాధ్యాయుడిని పడుకోబెట్టిన సంఘటనలున్నాయి.
- ఇంకా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఘటనలు వెలుగులోనికి రాకుండా ఉపాధ్యాయ సంఘాలు అడ్డుకుంటున్నాయనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇలాంటి సంఘటనలకు తెరపడాలంటే జిల్లా విద్యాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.
- విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ జరిగింది. ఈ క్రమంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడగా, బదిలీ అయినవారిని అధికారులు రిలీవ్ చేయడంలేదు. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోంది. మగ పిల్లలను సైతం ఇబ్బందులు పెట్టిన సంఘటనలు జిల్లాలో కొన్ని పాఠశాలల్లో చోటుచేసుకున్నాయి.

**రక్షణతో కూడిన విద్య**



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ రక్షణతో కూడిన విద్య నందిస్తాం. ఉపాధ్యాయుల తీరు సరిగ్గా లేకుంటే విద్యార్థులు తక్షణమే పాఠశాల హెచ్‌ఎంలకు, తల్లిదండ్రులకు తెలియజేయాలి. గతంలో పాఠశాలల్లో ఉన్న కమిటీలు పని చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

# రుణమాఫీ ఎందుకు కాలేదు?

- రైతుల ఫిర్యాదులపై సర్వే
- వివరాల నమోదుకు అందుబాటులోకి పోర్టల్
- నేడు వెల్లడి కానున్న విధివిధానాలు
- రూ.2లక్షలకు పైబడిన రుణం చెల్లించేందుకు వెసులుబాటు


రుణమాఫీ జరగలేదని నేలకొండపల్లిలో ఏఓకు ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ వర్తించని రైతుల పిర్యాదులపై ప్రత్యేక సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైనప్పటికీ మూడు విడతల్లోనూ రుణమాఫీ కాలేదని వేలాదిగా రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యాన అర్హులను సర్వే ద్వారా గుర్తించాలని వ్యవసాయ శాఖను ప్రభుత్వం ఆదేశించగా.. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు 'రైతు భరోసా పంట రుణమాఫీ' పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఈ విషయమై మంగళవారం జరిగే రైతునేస్తం కార్యక్రమంలో ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రూ.2 లక్షలకు పైబడి రుణాలు కలిగిన రైతులకు వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**సగం కూడా కాలే...**

ఖమ్మం జిల్లాలో 3లక్షల మందికి రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని ఆశించారు. అయితే, మూడు విడతల్లో కేవలం 1.15 లక్షల మందికే నగదు జమ అయింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నోడల్ బ్యాంకులు గుర్తించిన వారికి సైతం రుణమాఫీ కాకపోగా రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలుచోట్ల ఆందోళనలు కూడా చేపట్టారు. అయితే, రేషన్ కార్డులు లేనివారు, ఇతర కారణాలతో పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి దూరమైనట్లు తెలుస్తుండగా అర్హులందరికీ వర్తింపచేయాలనే భావనతో ప్రభుత్వం సర్వేకు సిద్ధమైంది.

**ఇప్పటికే ట్రయల్స్**

పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి నోచుకోకపోవటంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటి ఆధారంగా రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలని ఉన్నతాధికారులు జిల్లా వ్యవసాయ అధికారులకు సూచించారు. అంతేకాక సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించేలా 'రైతు భరోసా పంట రుణమాఫీ' పోర్టల్‌ను ఈనెల 24న అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యవసాయాధికారులు ఇప్పటికే ట్రయల్‌గా అధికారుల వివరాలను నమోదు చేస్తున్నారు. కాగా, సర్వేలో క్లస్టర్ల వారీగా ఏఈఓలు, ఏఓలు, ఏడీఏలు పాల్గొననుండగా జిల్లా స్థాయిలో వ్యవసాయాధికారి పర్యవేక్షిస్తారు.

**ఎలా చేయాలి...**

పంటల సాగులో మెళకువలు వివరించేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రతీ మంగళవారం 'రైతునేస్తం' పేరిట రైతు వేదికల ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, కమిషనర్ గోపి పాల్గొని సర్వేపై దిశానిర్దేశం చేయనున్నారు.

**ఇప్పటికే 15 వేల ఫిర్యాదులు**

ఖమ్మం జిల్లాలో రుణమాఫీకి నోచుకోని రైతుల నుంచి ఇప్పటి వరకు 15 వేల దరఖాస్తులు అందాయి. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన 'పరిష్కృతి' కేంద్రంతో పాటు డివిజన్, మండల, క్లస్టర్ల స్థాయిలో రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పుడు మొదలు కానుండడంతో ఈ ఫిర్యాదుల సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

**రూ.2 లక్షలకు పైబడి ఉంటే...**

రైతులకు రూ.2లక్షల లోపు రుణాలు ఉంటే మూడు విడతల్లో మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, రూ.2లక్షలకు పైబడి రుణాలు కలిగిన వారు.. ఎక్కువ ఉన్న మొత్తాన్ని చెల్లించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. అయినప్పటికీ రైతులు మాత్రం మాఫీ వర్తిస్తుందో, లేదోనన్న మీమాంసతో చెల్లించలేదు. కొందరు చెల్లించినా మూడు విడతల్లో మాఫీ కాలేదు. ఈనేపథ్యాన రూ.2 లక్షలకు పైబడి రుణాలు కలిగిన రైతులు సైతం ఎక్కువగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే రూ.2లక్షల వరకు విడతల వారీగా మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

**ఖమ్మం జిల్లాలో రుణమాఫీ వివరాలు**

| విడత | రైతుల సంఖ్య | రుణమాఫీ(రూ.ల్లో) |
|---|---|---|
| మొదటి | 57,857 | 264,22,51,892 |
| రెండో | 33,942 | 262,50,56,893 |
| మూడో | 23,546 | 245,85,90,089 |
| మొత్తం | 1,15,345 | 772,58,98,874 |

# ప్రభుత్వాస్పత్రిలో ఖరీదైన శస్త్రచికిత్స

**ఆదివాసీ గిరిజనుడి దవడ ఎముకలకు వైద్యం**


శస్త్రచికిత్స చేస్తున్న దంత వైద్యుడు వినోద్

జూలూరుపాడు: జూలూరుపాడు పీహెచ్‌సీలోని డెంటల్ యూనిట్‌లో సోమవారం ఓ ఆదివాసీ గిరిజనుడికి దంత వైద్యనిపుణుడు పోటు వినోద్ ఖరీదైన ఆపరేషన్ చేశారు. లక్ష్మీదేవీపల్లి మండలం గట్టుమళ్లకు చెందిన కుంజా కన్నారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, పై,కింది దవడలు విరిగి పోయాయి. గట్టుమళ్లకు చెందిన ఇండోస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ నరేందర్ మల్కాజ్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న దంత వైద్యుడు పోటు వినోద్‌కు ఫోన్ ద్వారా పరిస్థితి వివరించాడు. వినోద్ గతంలో జూలూరుపాడులో విధులు నిర్వర్తించిన నేపథ్యంలో మల్కాజ్‌గిరి నుంచి వచ్చి శస్త్రచికిత్స నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు శ్రమించి పై, కింద దవడలకు స్టీల్ ప్లేట్లు అమర్చారు. ఇదే చికిత్స కార్పొరేట్ ఆస్పత్రిలో చేస్తే సుమారు రూ. 2.50 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్ వినోద్ తెలిపారు. అప్పటి కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని జూలూరుపాడు డెంటల్ యూనిట్‌లో మిషనరీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారని, అందుకే ఇక్కడికి వచ్చి వైద్యం అందించినట్లు పేర్కొన్నారు.

### నిందితుడికి రిమాండ్

మణుగూరు టౌన్: భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరుకు చెందిన గొంకిపర్తి రమాకాంత్‌కు సంఘమిత్రతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా ఏడాది నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. ఈ నెల 14న రమాకాంత్ తన భార్యపై దాడి చేశాడు. ఈ క్రమంలో సంఘమిత్ర తల్లి సుశీల అడ్డు రాగా, ఆమెపై కూడా దాడి చేయడంతో చేయి విరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

పాల్వంచరూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గాంధీనగర్‌లో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని నవభారత్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న తంగెళ్లపల్లి శివప్రసాద్ (33) ఆదివారం రాత్రి బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. గతంలో నవభారత్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షకుడుగా విధులు నిర్వహించాడు. మూడు నెలల క్రితం ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో కుటుంబపోషణ భారమై మానసికంగా కుంగిపోయాడు. రాఖీ పండుగకు పుట్టింటికి వెళ్లిన భార్య అపర్ణకు ఫోన్ చేసి తనకు బతకాలని లేదని చెప్పాడు. దీంతో ఆమె ఇంటి పక్కన ఉన్న సతీష్ అనే వ్యక్తికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా, అతను వెళ్లి చూసేసరికి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అక్కడి నీళ్లు కలుషితం కాలేదు..


డయేరియా బాధితులను 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పాత సూరారం కొయ్యగుంపులో 16 మంది వాంతులు, విరేచనాల బారిన పడగా వారికి వైద్య సహాయం అందించి, గ్రామంలో ప్రజలు తాగే నీటిని పరీక్షించామని, అయితే నీరు కలుషితం కాలేదని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి తెలిపారు. నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా, ఫ్లోరైడ్ లేదనే రిపోర్ట్ వచ్చిందని వెల్లడించారు. కలుషిత ఆహారం వల్లే అస్వస్థతకు గురయ్యారని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. కాగా, గ్రామంలో సోమవారం మరో ముగ్గురు వాంతులు, విరేచనాల బారిన పడ్డారు. గ్రామానికి చెందిన సోడే లలిత, ఆమె కుమారుడితో పాటు కార్తీక్ అనే వ్యక్తి అస్వస్థతకు గురి కాగా 108 ద్వారా పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఏరియా ఆస్పత్రిలో డయేరియా బాధితులను చేర్చుకోకుండా సిబ్బంది ఇబ్బంది పెట్టడంతో డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వైద్యులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు.

# సోషల్ మీడియాదే కీలకపాత్ర

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పరిష్కరించడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. సీపీఎం సోషల్ మీడియా విభాగం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నాయకుడు పిట్టల రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ ప్రధాన మీడియా కార్పొరేట్ కనుసన్నల్లో మెలుగుతున్న దశలో సోషల్ మీడియా గ్రామీణ స్థాయి ప్రజల ఇబ్బందులు, పాలకుల దివాళాకోరు విధానాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. పార్టీ పనివిధానం, సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయడంలో సరైన కార్యాచరణ లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యాన పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. కాగా, దేశంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ అబద్ధాలతో సోషల్ మీడియా ద్వారా విషం వెదజల్లుతున్నందున ఇదే వేదిక ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలియచేయాలని తమ్మినేని సూచించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండారు రవికుమార్, జగదీష్, వై.విక్రమ్, సుందర్, శంకర్, నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి, గొడుగు వెంకట్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

### మద్యానికి బానిసై ఆత్మహత్య

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లబోయిన అన్వేష్‌దొర(32) మద్యానికి బానిసయ్యాడు. దీంతో విసిగిపోయిన ఆయన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అన్వేష్ సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా ఆయన తల్లి రాంబాయి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్షన్నర స్వాహా


వివరాలు వెల్లడిస్తున్న సంఘవి

కామేపల్లి: నిరుద్యోగుల బలహీనతలను ఆసరా చేసుకుంటున్న కొందరు వసూళ్లకు తెగబడుతున్నారు. ఇదేరీతిలో మోసపోయిన కామేపల్లి జీపీ పరిధి గోపాలపురానికి చెందిన కొర్ర సంఘవి సోమవారం వెల్లడించిన వివరాలు... సంఘవి ఇంటర్ పూర్తి చేసి చిరుద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా గ్రామానికే చెందిన ఆమె బంధువులైన దంపతులు సంప్రదించారు. ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తికి రూ.3లక్షలు ముట్టచెబితే కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. దీంతో ఆమె 2022లో రూ.50వేలు, ఆతర్వాత రూ.లక్షన్నర ఇచ్చింది. మిగతా నగదు ఉద్యోగం వచ్చాక ఇవ్వాలని చెప్పారు. అయితే, నాటి నుంచి దాటవేత ధోరణి అవలంబిస్తుండడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంఘవి తెలిపింది.

### పందెం కోళ్లను ఎత్తుకెళ్లిన దొంగలు

కామేపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు పందెం కోళ్లను ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని జోగ్గూడెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జర్పుల చంద్రు, రామోజీ 25 పందెం కోళ్లను పెంచుతున్నారు. గుర్తు తెలియని దొంగలు ఫాంలోకి చొరబడి జాలీ కత్తిరించి సుమారు రూ.లక్ష విలువైన కోళ్లను ఎత్తుకెళ్లడంతో బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**గొర్రెపొట్టేళ్లు, మేకపోతు...**

ముదిగొండ: ఇంటి ఆవరణలో కట్టేసిన రెండు గొర్రె పొట్టేళ్లు, ఒక మేకపోతును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని బాణాపురానికి చెందిన వత్సవాయి దేవేందర్ రూ.80వేలు విలువైన రెండు గొర్రెపొట్టేళ్లు, ఒక మేకపోతు ఆయన కుమార్తె వివాహ విందు కోసం కొనుగోలు చేశాడు. వీటిని ఇంటి ఆవరణలో కట్టేయగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై సోమవారం దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ ఓ.మురళి తెలిపారు.

### 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్


స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఉద్యోగులు

కారేపల్లి: ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు, కారేపల్లి పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో 80క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. మండలంలోని చెన్నంగులగడ్డలో బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో ఆదివారం రాత్రి సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 80క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి వాహనంలో కారేపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇల్లెందు మండలానికి చెందిన వ్యాపారి ఇందుకు బాధ్యుడని తేలగా బత్తుల సంతోష్, అవుల సంపత్, బత్తుల రాజు, బత్తుల నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

### దంపతుల ఆత్మహత్యాయత్నం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ రేగా కాలనీకి చెందిన దంపతులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. మండలపు వెంకటకృష్ణ, స్వప్న మధ్య కొంత కాలంగా తగాదాలు జరుగుతున్నాయి. సోమవారం కూడా గొడవపడ్డారు. ఇంట్లోనే పురుగుల మందు తాగారు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్ ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా, ఇద్దరి పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు తెలిసింది.

### శతాధిక వృద్ధురాలి మృతి


కృష్ణమ్మ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): రుద్రంపూర్ పంచాయతీ నాలేరియా ప్రాంతానికి చెందిన ఉడుతల కృష్ణమ్మ (102) అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. ఆమె భర్త సిద్ధయ్య సుమారు 40 ఏళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక నాయకుడు మామిడి రాజేశ్వరరావు, విశ్వమాత మదర్ థెరిస్సా సేవా సంస్థ నిర్వాహకులు గూడెల్లి యాకయ్య, పొనగంటి రాజు, యాదగిరి, బండారి నాగేశ్వరరావు, బాస్కర్, ఓదెమ్మ తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి


సమ్మక్క (ఫైల్)

పినపాక: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొమరం సర్వేష్, సమ్మక్క(26) దంపతులు గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం ఇంట్లో పనులు చేస్తున్న క్రమంలో పైపులకు సర్వీస్ వైర్ ఆనుకుని ఉండటంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు స్పృహ తప్పి పడిపోయారు. గమనించిన స్థానికులు మణుగూరు 100 పడకల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సమ్మక్క మృతి చెందినట్లు తెలిపారు. సర్వేష్ పరిస్థితి నిలకడగానే ఉందని, ప్రమాదం లేదని తెలిపారు.

### అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఇల్లెందు: పట్టణంలోని బుగ్గవాగు జోడు పంపుల వద్ద 20 ఏళ్లుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ అనాథ దివ్యాంగుడైన వృద్ధుడు భూక్యా రాంసింగ్ నాయక్(80) సోమవారం మృతి చెందాడు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు అంకెపాక నవీన్, సయ్యద్ అజిమ్, నయాం, మాడిశెట్టి రాజు, మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.